క్లుప్తంగా

ప్రచార బృందానికి అభినందన



నెల్లూరు(బారకాసు): మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా 'నషా ముక్త్ భారత్ అభియాన్' ప్రచారాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న బృందాన్ని కమిషనర్ వికాస్ మర్మత్ అభినందించారు. అంతార్జాతీయ పర్వతారోహకుడు అనిల్‌కుమార్ సారథ్యంలో కార్పొరేషన్ కార్యాలయానికి మంగళవారం చేరుకున్న ప్రచార బృందాన్ని ఆయన ఆహ్వానించారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ 141 రోజుల పాటు 8 వేల కిలోమీటర్లకు పైగా దేశవ్యాప్తంగా పర్యటించనుందని తెలిపారు.

నీట్ ఫలితాల విడుదల

నెల్లూరు (టౌన్): వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి గానూ గత నెల ఏడున నిర్వహించిన నీట్ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మంగళవారం రాత్రి విడుదల చేసింది. పరీక్షకు జిల్లా వ్యాప్తంగా నాలుగు వేల మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. అయితే వెబ్‌సైట్ మొరాయిస్తుండటంతో ఫలితాలు పూర్తి స్థాయిలో రాలేదు. దీంతో జిల్లాకు వచ్చిన ర్యాంకుల వివరాలు అందలేదు.

నిద్రిస్తున్న వ్యక్తిపై కత్తితో దాడి

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని గాంధీ నగర్‌కు చెందిన నాగలూరు వెంకటేశ్వర్లు తన ఇంట్లో నిద్రిస్తుండగా అదే ప్రాంతానికి చెందిన నక్క కృష్ణయ్యతో పాటు మరో వ్యక్తి కత్తితో దాడి చేశారు. ఈ ఘటన మంగళవారం వేకువజామున చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. నాగులూరు వెంకటేశ్వర్లు తన ఇంట్లో నిద్రిస్తుండగా నక్క కృష్ణయ్య మరో వ్యక్తితో కలిసి వచ్చి దాడి చేశారు. దీంతో తీవ్రగాయాలైన వెంకటేశ్వర్లును చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటన జరిగిన వెంటనే వెంకటేశ్వర్లు భార్య పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి దాడి చేసిన వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఇందులో కృష్ణయ్య మాత్రం దొరకగా మరొకరు పరారయ్యారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందగా కేసు నమోదు చేశారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

మనుబోలు : మండలంలోని వడ్లపూడి గ్రామంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. గ్రామదేవత పొన్నూరమ్మ దేవాలయంలో వంటశాలను ప్రారంభించిన సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో వడ్లపూడి, గొట్లపాళెం గ్రామాలకు చెందిన పలువురు యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రక్తనిధి జిల్లా మోటివేటర్ మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

మనుబోలు : భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు ఉపకరిస్తాయని ఉప తహసీల్దార్ బాలకోటమ్మ అన్నారు. మండలంలోని వెంకన్నపాళెం సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై పలువురు రైతులు అధికారులకు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు రైతులకు తెలిపారు. ఆర్ఐ శివప్రసాద్, వీఆర్వో భగవాన్, వీఆర్ఏ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్ర గ్రామాలే లక్ష్యం

మనుబోలు : పరిశుభ్రమైన గ్రామాలే లక్ష్యంగా పని చేస్తున్నట్లు పంచాయతీ విస్తరణాధికారి ప్రసాద్ అన్నారు. మనుబోలు, బద్దెవోలు గ్రామాల్లో మంగళవారం పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరిగాయి. రోడ్ల పక్కనున్న చెత్తను తొలగించి మురుగు కాలువల్లో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ఉదయం నుంచి గ్రామాల్లో చెత్త తొలగించే కార్యక్రమాలు చేపడతున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ఉదయం నుంచి గ్రామాల్లో ఉంటూ పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణ, చెంచుప్రసాద్ పర్యవేక్షించారు.

సులభతరంగా జనన ధ్రువీకరణలు

కొడవలూరు: సులభతరంగా జనన ధ్రువీకరణలు పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకొందని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. కొడవలూరు పీహెచ్‌సీలో ఎనిమిది మంది పిల్లల తల్లిదండ్రులకు జనన ధ్రువీకరణలు మంగళవారం ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు పిల్లల జనన ధ్రువీకరణల కోసం తల్లిదండ్రులు ఎంతగానో ఇబ్బంది పడేవారన్నారు. వాటికి క్లెం వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సులువుగా పొందేలా చర్యలు తీసుకొందని చెప్పారు. ఎక్కడి ఆస్పత్రిలో జన్మించినా క్షణాల్లో జనన ధ్రువీకరణ పొందే వెసులుబాటు కల్పించిందన్నారు. వైద్యాధికారి బాలచంద్రబాబు పాల్గొన్నారు.

యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు..

- జోరుగా అక్రమ మైనింగ్
- ఇరిగేషన్, రెవెన్యూ, అటవీ భూముల్లో తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ యథేచ్ఛగా సాగుతోంది. మట్టి, గ్రావెల్, ఇసుకకు మంచి డిమాండ్ ఉండటంతో ఆయా ప్రాంతాల్లోని రెవెన్యూ, ఇరిగేషన్, అటవీ శాఖలకు సంబంధించిన భూముల్లో పగలు, రాత్రీ అనే తేడా లేకుండా అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. రూరల్ పరిధిలోని పడమటి వైపు గ్రామాల్లో మట్టి, గ్రావెల్‌కు అనువైన ప్రాంతాలున్నాయి. ఆమంచర్ల పంచాయతీ పరిధిలోని మన్నవరప్పాడు, అప్పయ్యకండ్రిగ, తదితర ప్రాంతాల్లో జేసీబీ ద్వారా మట్టి, గ్రావెల్ తవ్వకాలు జరిపి దూర ప్రాంతాలకు సైతం తరలించి అక్రమార్జనకు పాల్పడుతున్నారు.



ఇసుక తరలింపునకు ఏర్పాటు చేసిన దారి



కొమ్మరపూడి చెరువులో జేసీబీతో తవ్వకాలు

పెన్నానూ వదల్లేదు..

కోడూరుపాడులోని పెన్నానదిలో ఇసుకను రాత్రి వేళ స్థానికంగా ఉన్న ట్రాక్టర్ల నిర్వాహకులు తవ్వి సమీప ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పెన్నాలోకి ట్రాక్టర్లు వెళ్లేందుకు వీల్లేకుండా రహదారికి అడ్డుకట్టలను గతంలో వేసేవారు. రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో ట్రాక్టర్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు

అక్రమ తవ్వకాల విషయంలో ఆయా శాఖల అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎస్ఈబీ అధికారులు ఆయా ప్రాంతాల్లో నిఘా ఉంచి తవ్వకాలకు గతంలో అడ్డుకట్ట వేసేవారు. ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి ఈ వ్యవహారంపై కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విచారణ జరిపి చర్యలు చేపడతాం

రూరల్ పరిధిలోని ప్రాంతాల్లో ఇరిగేషన్ స్థలాల్లో అక్రమంగా తవ్వకాలు జరిపితే చర్యలు చేపడతాం. అనుమతుల మేరకే మట్టిని తరలించే అంశమై ఇరిగేషన్ ఏఈలను అప్రమత్తం చేస్తున్నాం. చెరువుల పరిరక్షణకు అవసరమైన చర్యలను సిబ్బంది ద్వారా తెలుసుకుంటాం. మట్టిని అక్రమంగా తరలిస్తే ఉపేక్షించేదిలేదు.

– నాగరాజు, ఈఈ, ఇరిగేషన్ శాఖ

ఇదీ తంతు..

- గొల్లకందుకూరు, సజ్జాపురం, వెల్లంటి, దేవరపాళెం ప్రాంతాల్లో తవ్వకాలను గుట్టుచప్పుడు కాకుండా జరుపుతున్నారు. నీటిపారుదల శాఖకు చెందిన చెరువుల్లో తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి.
- తవ్వకాలతో కొమ్మరపూడి చెరువులో భారీ గోతులు ఏర్పడుతున్నాయి. గతంలో చిన్నారులు, పశువులు పడిన ఘటనలు ఎన్నో ఉన్నాయి.
- నగరానికి కూతవేటు దూరంలో ఉన్న అక్కచెరువుపాడు, అంబాపురం ప్రాంతాల్లోని చెరువులు, ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు జరుగుతుండటంతో స్థానికులు పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇక్కడ తవ్విన మట్టిని నగరంలోని వివిధ ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

అనుమతులకు మించి తవ్వకాలు

తవ్వకాలకు సంబంధించి అక్రమార్కులు ఆయా శాఖల నుంచి అరకొరగా అనుమతులు పొందుతున్నారు. వారికి మంజూరు చేసిన క్యూబిక్ మీటర్లకు మించి ఇష్టారాజ్యంగా తవ్వకాలు సాగిస్తున్నారు. ఒక మీటర్ లోతు వరకే తవ్వకాలు జరపాలనే నిబంధన అమలు కావడంలేదు. నెల్లూరు శివారు ప్రాంతాల్లో లే అవుట్లకు మట్టి, గ్రావెల్ అవసరాలు అధికంగా ఏర్పడ్డాయి. వీటి తవ్వకాలతో అక్రమార్కులు అనతికాలంలోనే కోట్లకు పడగలెత్తుతున్నారు.

కాలువల్లో వ్యర్థాలు వేస్తే జరిమానా

నెల్లూరు(బారకాసు): కాలువల్లో వ్యర్థాలు వేస్తే జరిమానాలు విధించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. వెంకటేశ్వరపురంలో జరుగుతున్న చెత్త సేకరణ పనులను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. కాలువల్లో క్రమం తప్పకుండా పూడికతీత పనులను చేపట్టడంతో పాటు సిల్ట్ వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. వ్యర్థాలను రోడ్లు, కాలువల్లో వేయరాదని, దుకాణాల ముందు డస్ట్ బిన్లను విధిగా ఉంచాలని విజయ డెయిరీ సమీపంలోని దుకాణాల నిర్వాహకులకు సూచించారు. అపరిశుభ్రంగా ఉంటే నిర్వాహకులకు నోటీసులను జారీ చేసి జరిమానాను విధిస్తామని తెలిపారు.

- జగనన్నకు చెబుదాం, స్పందనలో పునరావృతమైన ఫిర్యాదులను కమిషనర్ పరిశీలించారు. మనుమసిద్ధినగర్, ఏసీనగర్, వెంకటేశ్వరపురం, తదితర ప్రాంతాలకు సంబంధించిన ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఎంహెచ్ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.
- ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి యోజన ఎంతో ఉపయోగకరమని, ప్రతి ఒక్కరూ బీమాను నమోదు చేసుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఒక ప్రకటనలో కోరారు. నగరపాలక సంస్థ పరిధిలో 1,32,008 మందిని లబ్ధిదారులుగా గుర్తించారని, అర్హులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.ఐదు లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం బీమా కవరేజ్‌గా లభిస్తుందన్నారు. ఆయుష్మాన్ భారత్ పీఎంజేజేవై పథకానికి ఇప్పటి వరకు 83,929 మంది దరఖాస్తు చేసుకోగా, 48,079 మందిని లబ్ధిదారులను చేర్చామని చెప్పారు. వలంటీర్ లేదా స్థానిక సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



రోడ్డు పక్కన వేసిన చెత్తను పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం

నెల్లూరు(బృందావనం): పాస్టర్లు నిత్యం పునరుత్థాన శక్తితో సేవలందించాలని లోన్ స్టార్ తెలుగు బాప్టిస్ట్ చర్చి ఫస్ట్ సర్వీస్ పాస్టర్ రెవరెండ్ కంచర్ల ప్రభుదాస్ పేర్కొన్నారు. నగరంలోని నీలగిరి సంఘంలో గల హెబ్రోన్ బిలీవర్స్ అసెంబ్లీస్ చర్చిలో నెల్లూరు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ నెలవారీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెవరెండ్ డేవిడ్ దయాసాగర్, అధ్యక్షుడు రెవరెండ్ సాల్మన్, రెవరెండ్ భాస్కరయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుదాస్

ఘనంగా 'డీకేడబ్ల్యూ' వార్షికోత్సవం

నెల్లూరు (టౌన్): డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల 59వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. కళాశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం 2021 – 22 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినులకు అకడమిక్, ఎండోమెంట్ బహుమతులను అందజేశారు. ప్రిన్సిపల్ గిరి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, గౌరి, స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్ మసీహా ఫిర్దోస్, వైస్ ప్రిన్సిపల్ రమణరావు, పీఆర్వో జోజీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

సీనియర్ సిటిజన్లపై నిర్లక్ష్యం తగదు

నెల్లూరు రూరల్: సీనియర్ సిటిజన్లపై కుటుంబసభ్యులు నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి పేర్కొన్నారు. కొత్తూరులోని నెహ్రూ భారతి వృద్ధాశ్రమంలో మంగళవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. చట్టాలపై సీనియర్ సిటిజన్లు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం వృద్ధాశ్రమంలోని వసతులను ఆరాతీశారు.



క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు సిటీ: పోలీసుల పిల్లలు క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి సూచించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో పోలీసుల పిల్లలకు కౌన్సెలింగ్‌ను నిర్వహించి వారు కోరుకున్న కార్పొరేట్ కళాశాలలో ఉచిత అడ్మిషన్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 90 మంది పోలీసుల పిల్లలకు 10 కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత అడ్మిషన్లను కేటాయించారని తెలిపారు. పోలీస్ సిబ్బందికి సహాయ, సహకారాలను అందిస్తామని చెప్పారు. ఉచిత సీట్ల కేటాయింపులో పారదర్శకంగా వ్యవహరించిన అధికారులు, పోలీస్ అసోసియేషన్ జిల్లా సభ్యులను అభినందించారు. అడిషనల్ ఎస్పీలు హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, ఏఆర్, హోంగార్డ్స్ డీఎస్పీలు గాంధీ, చంద్రమోహన్, ఏపీ పోలీస్ అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

యువగళం పేరిట సోమిరెడ్డి దందాలు

నెల్లూరు(దర్గామిట్ట): యువగళం పాదయాత్ర పేరిట టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దందాలు సాగిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య ధ్వజమెత్తారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. పత్రికల్లో వచ్చిన ప్రతి వార్తనూ చూపి మాట్లాడే స్థాయికి ఆయన దిగజారిపోయాయని విమర్శించారు. మహిళా వైద్యురాలితో గతంలో వ్యవహరించిన తీరుపై అదే పేపర్‌లో వచ్చిన అంశాన్ని వివరించగలరానని ప్రశ్నించారు. మిల్లర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్దకెళ్లి ముడుపులివ్వాలని డిమాండ్ చేస్తున్నారని, లేని పక్షంలో బహిరంగ సభలో మీపై మాట్లాడిస్తానని బెదిరిస్తున్నారని ఆరోపించారు. లోకేష్‌ను తీసుకొస్తానని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికే రూ.పది కోట్లకుపై వసూళ్లకు పాల్పడ్డారన్నారు. రాజకీయంగా సోమిరెడ్డికి పుట్టగతుల్లేవని, అలాంటి వ్యక్తిని పక్కబెట్టుకొని యువగళం పాదయాత్ర చేయాలనుకోవడం లోకేష్ దౌర్భాగ్యమని పేర్కొన్నారు. వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నెల్లూరు శివప్రసాద్, పార్టీ నేతలు శంకరయ్యగౌడ్, మోహన్‌నాయుడు, కప్పిర సురేష్, చీకుర్తి నరసయ్య, భాస్కర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటశేషయ్య

గరుడ వాహనంపై మహావిష్ణు



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థాన ప్రాంగణంలో కొలువైన మహాలక్ష్మి గోదా సమేత గురువాయూర్ మహావిష్ణు బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు గరుడవాహనంపై మంగళవారం కొలువుదీరారు. అయ్యప్పస్వామి దేవస్థానం నుంచి నిప్పో సెంటర్ వరకు.. అక్కడి నుంచి ప్రధాన మార్గంలో నగరోత్సవం సాగింది. మహాకుంభారాధన, నిత్యహోమం, శాత్తుమొరై, హయగ్రీవ హోమం, ఉత్సవమూర్తులకు అభిషేకం, ధన్వంతరి, అష్టాక్షరి హోమాలను విశేషంగా నిర్వహించారు. శ్రీదేవీ, భూదేవీ సమేత మహావిష్ణుకు తిరుమంజనం, సహస్రనామార్చనలను ఉదయం జరిపారు. ఉభయకర్తలుగా పిడూరు కిషోర్‌రెడ్డి, శరణ్య దంపతులు, సాయిప్రణీత్‌రెడ్డి, సాయి అశ్రియ, అరుణమ్మ వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ నిర్వాహకులు శేషగిరిరావు, వెంకటరత్నం, మురళీమోహన్‌రెడ్డి, శంకర్, తదితరులు పర్యవేక్షించారు.

క్రీడాకారులకు అభినందన

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాకు చెందిన బాక్సింగ్ క్రీడాకారులను సెట్నెల్, డీఎస్‌ఏ సీఈఓ పుల్లయ్య మంగళవారం అభినందించారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని తన చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విజయవాడలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్ – 17 బాక్సింగ్ పోటీల్లో 60 – 70 కిలోల కేటగిరీలో అబ్దుల్ రియాజ్ రజత, 80 + కేటగిరీలో సుభాష్ కాంస్య, 57 – 60 కేటగిరీలో వైజయంతి రజక పతకాన్ని సాధించారని కొనియాడారు. బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా సభ్యుడు సుధీర్, డీఎస్‌ఏ బాక్సింగ్ కోచ్ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.



రాహుల్ గాంధీని ఆశీర్వదించండి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ప్రజలు ఆశీర్వదించాలని పార్టీ నేత డాక్టర్ పల్లంరెడ్డి యశోధర కోరారు. కోటమిట్టలో ఇంటింటి ప్రచారాన్ని మంగళవారం ఆమె నిర్వహించారు. అనంతరం స్టిక్కర్లను అతికించారు. పార్టీ నేతలు అబ్రా, ఫౌజియా, సయీమ్, సబ్రీన్, తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతలకు సత్కారం

నెల్లూరు(బృందావనం): ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు రక్తదాతలను లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రియదర్శిని ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సతీష్‌కుమార్, లీలాధర్‌రెడ్డి, సునీల్‌బాబు, హర్షవర్ధన్, హేమంత్‌ను సన్మానించారు.



భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం

నెల్లూరు(బృందావనం): నగరంలోని పుత్తా ఎస్టేట్స్ సమీపంలో గల జిల్లా బ్రాహ్మణ భవనంలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రమా సత్యనారాయణస్వామి వ్రతం, విష్ణులలిత పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన దేవదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్‌ను బ్రాహ్మణ సేవా సంఘాల సమితి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసుదేవరావు, కామేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో సత్కరించారు. దుద్దుకూరు రమేష్, పారా శ్రీధర్‌శర్మ, డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం, అడ్వొకేట్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న నేతలు

ముగిసిన బ్యాడ్మింటన్ సమ్మర్ క్యాంప్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నెల పాటు నిర్వహించిన ఉచిత వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులను బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దూడల సుధాకర్ అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నిమ్మల వీరవెంకటేశ్వర్లు మాట్లాడారు. అండర్ – 17 రాష్ట్రస్థాయి పోటీలను ఈ సీజన్లో నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ అనుమతిచ్చారని తెలిపారు. డీఎస్‌ఏ చీఫ్ కోచ్ యతిరాజ్, వరప్రసాద్, కోచ్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు వారం సెలవులివ్వరూ..

నెల్లూరు (టౌన్): విపరీతమైన వడగాలులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ క్రమంలో పాఠశాలలకు వారం పాటు సెలవులను ప్రకటించాలని పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నరహరి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఒంటి పూట బడులను నిర్వహిస్తున్నా, ఉదయం తొమ్మిది గంటలకే ఎండ తీవ్రతతో పాటు వడగాలులు వీస్తున్నాయన్నారు.

వ్యక్తి అదృశ్యం

నెల్లూరు సిటీ: వ్యక్తి అదృశ్యమైన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. లేక్‌వ్యూ కాలనీలోని తొమ్మిదో వీధిలో నూర్జహాన్, ఆమె కుమారుడు మసూమ్ నివాసం ఉంటున్నారు. విభేదాల కారణంగా మసూమ్ దంపతులు కొంతకాలంగా వేర్వేరుగా ఉంటున్నారు. దీంతో మానసికంగా కుంగిపోయిన ఆయన పనులకు సైతం వెళ్లకుండా తల్లితో ఉంటున్నారు. వారి ఇంటి సమీపంలోని డ్రైవర్ అంకయ్య తన లారీలో క్లీనర్‌గా మసూమ్‌ను చేర్చుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల ఏడున వీరిద్దరూ వెళ్లారు. పదో తేదీన ఇంటికి అంకయ్య చేరుకోగా, తన కుమారుడు రాకపోవడంతో మసూమ్ తల్లి ప్రశ్నించారు. బంగారుపేట వద్ద కాలకృత్యాలకు వెళ్లిన మసూద్ తిరిగి రాలేదని, చాలా సేపు చూసి ఎంతకీ రాకపోవడంతో నెల్లూరుకు తిరిగొచ్చానని అంకయ్య తెలిపారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు న్యాయం చేయాలని వినతి

నెల్లూరు (దర్గామిట్ట): సీతారామపురం మండలం పబ్బులేటిపల్లిలో జాతీయ రహదారికి సంబంధించిన భూసేకరణలో భూమి కోల్పోతున్న రైతులకు నష్టపరిహారంలో న్యాయం చేయాలని మాజీ జెడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి కోరారు. ఈ మేరకు కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. కాగా పరిశీలించి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

స్విమ్మింగ్‌లో జిల్లాకు పతకాలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): విజయవాడలో ఇటీవల నిర్వహించిన సీనియర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో ఆరు పతకాలను జిల్లా క్రీడాకారులు సాధించారని ఆక్వాటిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మధు, సనత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 మీటర్ల ఫ్రీ స్టయిల్, 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్, 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 50 మీటర్ల బటర్‌ఫ్లయ్ పోటీల్లో చరణ్‌కుమార్ నాలుగు స్వర్ణ, 1500 మీటర్ల ఫ్రీ స్టయిల్, 800 మీటర్ల ఫ్రీ స్టయిల్లో వచన్ రెండు రజత పతకాలను సాధించారని పేర్కొన్నారు.